## క్లుప్తంగా

### కళాశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



ప్రిన్సిపాల్‌కు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ నీలం సంజీవరెడ్డి ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ఆవరణకు కంచె ఏర్పాటుకు 1985 –1988 సంవత్సరానికి చెందిన బీఏ పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. బుధవారం పూర్వ విద్యార్థులు ముక్కమల్ల జయరామిరెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, విజయసారథి వర్మ, మొయినుద్దీన్, అల్లే శంకర్ రెడ్డి తదితరులు.. ప్రిన్సిపాల్ హేమలతకు రూ.58,500 నగదును విరాళంగా అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులు కళాశాల అభివృద్ధికి చేయూతనివ్వడం సంతోషకరమన్నారు.

### భవన నిర్మాణాలు పూర్తిచేయాలి



ఎంపీడీఓ, ఎంపీపీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు పూర్తి చేసి, వాటికి రహదారులను ఏర్పాటు చేయాలని సర్పంచు మశమ్మ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మేరి, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలతలకు వినతి పత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం, రైతుభరోసా, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వీటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణ తదితరులు ఉన్నారు.

### పాఠ్యపుస్తకాల మంజూరు



ఎంఈఓ కార్యాలయంలో నిల్వ చేసిన పాఠ్యపుస్తకాలు

జూపాడుబంగ్లా: మండలంలోని 39 పాఠశాలలకు రెండో విడత పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. మండలం వ్యాప్తంగా 4,860 మంది విద్యార్థులకు ఇదివరకే మొదటి విడత పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. రెండో విడతగా 11,690 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

### జ్వాలా వీరభద్రస్వామికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజ చేపట్టారు.

**అలరించిన భజన**

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన మారుతీ వెంకటేశ్వరరావు భజన మండలి వారు నిర్వహించిన భజన కార్యక్రమం అలరించింది. భజన కీర్తనలను నగేష్, రామకృష్ణ, పెద్దయ్య, సంజన్న, నాగేశ్వరప్ప, రాజమోహన్‌రెడ్డి, కోటేశ్వర్, నారాయణరెడ్డి, బీరప్ప, లోకేశ్వరరెడ్డి, ఈశ్వర్ ఆలపించారు.

### బంకుకు నిప్పు

మహానంది: తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లుకు చెందిన బంకును గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారని బాధితుడు వాపోయాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. బంకులోని తినుబండారాలు మొత్తం కాలిపోయాయని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

### గడువు ముగిసిన మందుతో లేగదూడ మృతి

జూపాడుబంగ్లా: మందుల దుకాణం దారుడు విక్రయించిన గడువు ముగిసిన మందు వల్ల లేగదూడ మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని కనకయ్యకొట్టాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటరమణ ఆవు పదిరోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. మూడు రోజుల క్రితం లేగదూడ అనారోగ్యానికి గురవ్వటంతో తూడిచెర్లలోని తిరుమలరావు మందుల దుకాణం వద్దకు వెళ్లి దూడకు ఆరోగ్యం బాగోలే దని చెప్పటంతో మోనోసెఫ్ అనే మందును ఇచ్చాడు. మందును తీసుకెళ్లి ఆవుదూడకు ఇంజెక్షన్ వేయగా.. ఆరోగ్యం క్రమేణా క్షీణించటంతో మంగళవారం రాత్రి మృతిచెందింది. ఈ విషయమై జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



నందికొట్కూరులో నీలిషికారిపేట వినాయకుడి ఊరేగింపు



నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో వేదికపై చిన్నారుల నృత్యం



మహానందిలో యువకుల విన్యాసాలు



శ్రీశైలంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

# వినాయకా... సెలవిక!

- ఉల్లాసంగా వినాయక నిమజ్జనం
- ఆకట్టుకున్న శోభాయాత్ర
- యువకుల కోలాహలం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నందికొట్కూరు: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు భక్తులు వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం గణేష్ నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలో 75 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. యువకుల డాన్స్‌లు, కేరింతలు, మేళ తాళాల మధ్య విగ్రహాలు ఊరేగింపు కొనసాగింది. జూపాడుబంగ్లాలోని కేసీ కెనాల్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. ఊరేగింపులో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు రంగుల చల్లుకొన్ని సంబరాలు జరుపుకున్నారు. గణేషుడిని దర్శించుకునేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఊరేగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. భక్తులకు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్ తాగునీటిని సరఫరా చేశారు. సీఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు సురేష్‌బాబు, చంద్రశేఖర్, తిరుపాలు, ఓబులేసు, శరత్‌కుమార్‌రెడ్డి భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాలయ్య, సభ్యులు వెంకటేశ్వర్లు, ఆర్ట్ శ్రీను, భాను, విద్యుత్ శాఖ ఏడీఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**భక్తుల్లారా...సెలవిక**

జూపాడుబంగ్లా: ఐదురోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్ననాయకుని ప్రతిమలను బుధవారం చివరి పర్యాయం పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. మండలంలోని జూపాడుబంగ్లా, తూడిచెర్ల గ్రామాల్లో గణేష్ ప్రతిమలను ఆనందోత్సాహాల మధ్య ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో తిప్పారు. అనంతరం కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. అలాగే నందికొట్కూరు పట్టణానికి చెందిన వినాయకుని ప్రతిమలను ఇక్కడే నిమజ్జనం చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే భక్తులు కేసీ కాల్వలో గల్లంతు కాకుండా నాటుపడవలతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.



వెళ్లొస్తా భక్తుల్లారా...కేసీ కాల్వలో మునిగి పోతున్న గణనాథుడు



పాతబస్టాండ్ నుంచి ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్తున్న భారీ వినాయకుడు



కేసీ కాల్వలో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

**గంగమ్మ ఒడికి గణనాథుడు**

కొత్తపల్లి: ఐదురోజులుగా భక్తులచే పూజలందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. మండలంలోని దుద్యాల, ఎదురుపాడు గ్రామాలలో బుధవారం భక్తులు వైభవంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకున్నారు. వినాయకుడికి ఉదయం నుంచే విశేష పూజలు నిర్వహించి, సాయంత్రం విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామాలోని పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

మహానంది: మండల పరిధిలో వినాయక నిమజ్జనం బుధవారం యువకుల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజల అనంతరం శోభయాత్ర ఉల్లాసంగా సాగింది. ఈ సందర్భంగా గణపతి బప్పా.. మోరియా అనే నినాదం మారుమోగింది. మహానంది, మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామాల్లో సుమారు 40కి పైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. వినాయకుడి లడ్డూకు వేలాలు పోటాపోటీగా జరిగాయి. తిమ్మాపురంలోని బ్యాంకు బజారులో లడ్డూను కొలిమి షరీఫ్ రూ.28వేలు, పీర్ల చావిడి దగ్గర ఉన్న లడ్డూను ఉల్లి నరేష్ రూ.20వేలు, మరో లడ్డూను పులిబండ్ల జగన్ రూ.20,600, పెద్దమ్మ అరుగువద్ద మందా శ్రీనివాసులు రూ.18వేలు, అంకాల పరమేశ్వరీదేవి ఆలయం వద్ద కూరాకుల సత్యమయ్య రూ.17,200, అమ్మవారిశాల వద్ద ఉన్న విగ్రహం లడ్డూను పోలిశెట్టి శివ రూ. 16వేలకు దక్కించుకున్నారు. మహానందిలోని శరభయ్యశర్మ ఇంటి వద్ద ఉన్న విగ్రహం లడ్డూను శ్రవణ్ అండ్ ఫ్రెండ్స్ రూ.23,500, దేవస్థానం విగ్రహం లడ్డూను ఫణి రూ.10వేలు, దేవస్థానం కాలనీలోని లడ్డూను భార్గవ్ కుమార్ రూ.6,300, పార్వతీపురంలో గుడిగుంట్ల నరసింహ రూ. 10వేలు, దేవస్థానం కాలనీలో మురళీ రూ. 6,500, పార్వతీపురంలో పిక్కిలి లక్ష్మీదేవి రూ. 10వేలు, జమ్మిచెట్టు వద్ద మనోజ్ రూ. 12,500తో దక్కించుకున్నారు.

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని పలు కాలనీలలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో గణపతి భక్తుల నుంచి ప్రత్యేక పూజలందుకుంటున్నారు. బుధవారం క్షేత్ర పరిధిలోని సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు వద్ద గణేశునికి విశేష పూజల అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి నిర్వాహకులుగా ప్రజాసంబంధాల అధికారి టీ.శ్రీనివాసరావు, వసతి విభాగ అధికారులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



తిమ్మాపురంలో లడ్డూను దక్కించుకున్న సత్యమయ్య

**కృష్ణమ్మ ఒడి చేరిన గణనాథుడు**

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో కొలువుదీరిన 40 గణనాథుల విగ్రహాలను కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రంలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను నెలకొల్పారు. ఐదు రోజుల పాటు భక్తుల నుంచి ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడు బుధవారం కృష్ణమ్మ ఒడి చేరాడు. నిమజ్జనం సందర్భంగా విగ్రహ కమిటీల నిర్వాహకులు ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసి సాయంత్రం మేళతాల మధ్య శోభాయాత్ర సాగింది. డ్యాం దిగువ భాగమైన లింగాలగట్టు ప్రాంతంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. టూటౌన్ సీఐ చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరిన వినాయక ప్రతిమ



భక్తులకు మంచినీరు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు



జూపాడుబంగ్లాలో నిమజ్జనం సందర్భంగా యువతుల ఆనందకేళి

### పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

వెలుగోడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కోమలి సూచించారు. మండలంలోని వేల్పనూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పౌష్టికాహారం మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు బాల్య వివాహాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, శానిటేషన్, రక్తహీనత తదితర అంశాలపై స్థానికులకు వివరించారు. అనంతరం పాఠశాల నుంచి గ్రామ వీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

**పౌష్టికాహారం తీసుకోవాలి**

పాములపాడు: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని హెచ్ఎం కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్వైజర్ లలిత ప్రభావతి అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామం జెడ్పీహెచ్ స్కూలులో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.

### హెచ్ఐవీ పరీక్ష.. భవిష్యత్‌కు భరోసా

పగిడ్యాల: హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవడంతో భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ లింక్ వర్కర్ స్కీం బుజ్జమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్. ఘణపురం గ్రామంలో హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వ్యక్తుల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. దీంతో అవకాశవాద వ్యాధులు సంక్రమిస్తాయని, ఈ దశను ఎయిడ్స్ అంటారన్ని ప్రజలకు తెలియజేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఉమాదేవి, ఆశావర్కర్ అనురాధ, ఆయా బీబీ పాల్గొన్నారు.



హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న లింక్ వర్కర్ బుజ్జమ్మ

### రక్తహీనత నివారణకు పౌష్టికాహారం

కొత్తపల్లి: రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ సెంటర్లలో ఇచ్చే పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి సూచించారు. బుధవారం కొత్తపల్లి మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో పోషణ్ మహా అభియాన్ నిర్వహించారు. ముందుగా అక్కడ పోషకాహార స్టాల్‌లో ఉన్న చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆశీర్వదమ్మ, వైద్యాధికారులు మహమ్మద్ బేగ్, జబీర్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలకు పరిష్కారం చూపాలి

కొత్తపల్లి: మండల సర్వసభ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలన్నింటికీ తప్పనిసరిగా పరిష్కారం చూపాలని ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. అధికారులు వచ్చాము, వెళ్లామంటే కుదరదన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. అయా శాఖల అధికారులతో శాఖల వారీగా ఎంపీడీఓ దాసరి మేరి ఆధ్వర్యంలో ప్రగతి నివేదికలను వినిపించారు. వారు మాట్లాడుతూ సభ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓకు సూచించారు. మండలంలో వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రెవెన్యూ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం నివేదికలు తయారు చేయాలన్నారు. మండలంలో ఎక్కువగా కరెంటు సమస్యలు ఉంటాయని సంబంధిత అధికారులు విద్యుత్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమలత

**ఆరు వేల ఎకరాల్లో పంట నష్టం**

డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ వ్యవసాయ అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి దాదాపు 6 వేల ఎకరాల పంటలు నష్టపోయినట్టు గుర్తించామన్నారు. నష్టపోయిన రైతులు ఇంకా ఎవరైనా ఉంటే సంబంధిత అధికారులను కలిసి తమ పొలాలను చూపించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జయమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: పట్టణంలోని రోకియాబీ దర్గా ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఉస్మానియా ముస్లిం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మోమిన్ రసూల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు చెందిన శాంతిరాం ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని చికిత్స చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈహెచ్ఎస్, హెల్త్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులపై ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. శుక్లం ఆపరేషన్‌కు ఎంపికైన వారిని అదేరోజు ఆపరేషన్ కోసం తీసుకువెళ్తారన్నారు. శిబిరంలో పాల్గొనేవారు ఆధార్, రేషన్ కార్డు, ఈహెచ్ఎస్, హెల్త్ కార్డులు తీసుకురావాలని సూచించారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 9985020296, 9390053731 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

### ప్రజలకు శుద్ధ జలాన్ని సరఫరా చేయాలి

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగడానికి శుద్ధి చేసిన జలాన్ని సరఫరా చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి సరఫరా చేసే నీటి పైపులకు ఇన్‌లెట్ క్లోరినేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, ట్యాంకులు శుభ్రం చేయడం, నీరు క్లోరినేషన్ చేయడం వంటి చర్యలు క్రమం తప్పకుండా చేస్తూ ఉండాలన్నారు. సమావేశంలో ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ అనిల్, ఈఓపీఆర్డీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చాలి

మహానంది: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే హామీలను నెరవేర్చాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. గాజులపల్లెలో బుధవారం రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి అధికారులకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం అందించలేదన్నారు. బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు సరిపడక రైతులు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. గాజులపల్లె సమీపంలోని బసవాపురం చెరువు ద్వారా పంటలకు నీళ్లు వచ్చేలా ఏర్పాటు చేయాలని, చెరువు కింద ఉన్న భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. మద్దిలేటి, రసూల్, రాజశేఖర నాయక్, నాగచంద్రుడు పాల్గొన్నారు.

### ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో సర్పం

కొత్తపల్లి: సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో బుధవారం సర్పం హల్‌చల్ చేసింది. ఎగువనుంచి కృష్ణానదిలో వరద ఉధృతికి నీటి వెంట నాగుపాము కొట్టుకు వచ్చిందిని అక్కడున్న భక్తులు చెబుతున్నారు. దీంతో అక్కడున్న భక్తులు, స్వాములు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటికి తర్వాతా ఆ పాము అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### వరద బాధితులకు విరాళం

ఆత్మకూరు: పట్టణంలోని బంగారు షాపుల యాజమాన్యం ఆధ్వర్యంలో వరద బాధితులకు రూ.3,01,116 లక్షల విరాళం చెక్కును వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి బుధవారం అందజేశారు. అందరి సహకారంతోనే శ్రీశైలం నియోజకవర్గం నుంచి విజయవాడ వరద బాధితులకు విరాళం అందించినట్లు బంగారు షాపుల యాజమాన్యం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.రషీద్ తెలిపారు.

### జాతీయ అటవీ అమరుల దినోత్సవం



ఆసుపత్రిలో బాలింతకు పండ్లు పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు



రేంజర్ రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆత్మకూరు ఎఫ్‌డీ డీడీ సాయిబాబా

ఆత్మకూరురూరల్ : జాతీయ అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాగార్జునసాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా అమరుడు ఫారెస్ట్ రేంజర్ రామయ్య చిత్రపటానికి నివాళులర్పించి అమరుల సంస్మరణను ప్రారంభించారు. అనంతరం పలువురు అటవీ అధికారులు అమరుల కృషిని స్మరించుకున్నారు. ఎఫ్ఆర్‌వోలు పట్టాభి,సుభాష్, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

డిప్యూటీ రేంజ్ ,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖలో ప్రాణాలొడ్డి అమరులైన వారికి అటవీ సిబ్బంది నివాళులర్పించారు. సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి డీఆర్ఓ వెంకటరమణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్ర ప్రసాద్, అటవీ అధికారులు కరివేన శివారులో నున్న మానవతా నిలయం వృద్ధాశ్రమం, ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

### పంటల నమోదు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ బి.ఆంజనేయ

ఆత్మకూరు: రైతులు సాగుచేసిన పంటలను నమోదు చేసి ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఏడీఏ బి.ఆంజనేయ, ఏఓ డి.విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని నల్లకాల్వ, కరివేన గ్రామాల్లో జరిగిన ఈ- పంట నమోదు, ఈ-కేవైసీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. మరో మూడు రోజుల్లోపు పూర్తి చేయించుకోవాలని సూచించారు.

**వంద శాతం పంట నమోదు పూర్తి..**

వెలుగోడు: మండలంలో వంద శాతం పంట నమోదు పూర్తయిందని ఏవో పవన్ కుమార్ తెలిపారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో బుధవారం ఈ- పంట నమోదు ఈ- కేవైసీని పరిశీలించారు.

**15లోపు పంట నమోదు చేయించుకోండి**

పాములపాడు: మండలంలోని రైతులందరూ ఈ నెల 15వ తేదీ లోపు పంట నమోదు చేసుకోవాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

**పంట నమోదులో జాప్యం తగదు**

మిడుతూరు: పంట నమోదులో జప్యం తగదని ఏఓ పీరునాయక్ హెచ్చరించారు. బుధవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల, తిమ్మాపురం గ్రామంలో పంట నమోదును పరిశీలించారు. అదే విధంగా చెరుకుచెర్ల గ్రామంలో పెస్టిసైడ్ దుకాణాన్ని తనిఖీ చేశారు.